


**పట్టపగలు** రెండు జాముల వేళ. ఎండ నిప్పులు చెరుగుతూ ఉంది. ఈ చెట్టు మీద పిట్ట ఆ చెట్టు మీదికి వెళ్ళలేకుండా ఉంది. అప్పుడప్పుడు రంయిమని వడగాడ్పు వీస్తోంది. ఆ గాలికి పండుటాకులు టపటపా రాలి పడుతున్నాయి. అల్లంత దూరాన ఉన్న హిమగిరి సానువుల మీద మంచి మంచుగడ్డలు కరిగి నీరు బ్రహ్మజాతి సర్పంలాగా సరసరా పరుగెత్తుతూ కిందికి దిగజారుతూంది. ఆశ్రమంలో బిల్వవృక్షం కింద లోచూపుతో పరమశివుణ్ణి చూస్తూ అంశుమంతుడు ధ్యానముద్రలో ఉన్నాడు. అప్పుడే గంగాజలాల బంగరుగిండి, పసిడి తామరాకులతో ఆరపండిన పండ్లు తెచ్చి భానుమతి పతి పక్కనే కూర్చుంది. అల్లనల్లన కళ్ళువిప్పాడు అంశుమంతుడు.

“ప్రభూ! ఈ పళ్ళు పరమేశ్వరుడికి నివేదించి ఆరగించండి. వేళ అయింది” అని అన్నది భానుమతి మెల్లగా.

అంశుమంతుడు చిరునవ్వు నవ్వి, “దేవీ! అతిథి ఎవరూ రాలేదా?” అన్నాడు.

“రాలేదు.”

“నేను ఆహారం తీసుకుని చాలాకాలం అయిం

దమకుంటాము. అతిథి సత్కారం చెయ్యనిదే సూర్యవంశపు రాజులు అన్నం ముట్టరు. నా వ్రతం నీకు తెలియదా? చూదాము. ఎవరైనా రావచ్చు. పోనీ! రేపైనా వస్తే అతిథి పూజచేసి మనం ఆరగించుదాము. ఇంతలో వచ్చిన ప్రమాదం ఏమిటి" అని నన్నగా అన్నాడు అంశుమంతుడు.

"అలాగే చెయ్యవచ్చు" అని భానుమతి ముందుకు చూసింది. సంతోషంతో భర్తను స్పృశించి—

"ఆర్యపుత్రా! ఎవరో వృద్ధ దంపతులు" అంది. అంశుమంతుడు చట్టున లేచాడు. "అవును. మన పాలిట భాగ్యదేవతలు. రా, రా, స్వాగతం చెప్పుదాము" అని ఎదురు వెళ్ళి ఆశ్రమద్వారం దాకా వచ్చిన ముసలి దంపతులకు సాష్టాంగ నమస్కారం చేసి లోనికి తీసుకు వచ్చాడు. పాదాలు కడిగి ఆ నీరు ఇద్దరూ తలంపై చల్లుకున్నారు. దర్భాసనాలు వేసి, "కూర్చోండి" అని వినయంగా వేడుకున్నాడు అంశుమంతుడు. ఆ దంపతులిద్దరూ ఒకరి చెయ్యి ఒకరు ఊతగా మెల్లగా నడుములు వంచి దర్భాసనాల మీద చతికిలబడి కూర్చున్నారు. "అమ్మయ్యా!" అని నిట్టూర్పు విడిచి కళ్ళు మూసుకున్నారు ఆయాసం పడుతూ.

పార్వతీ పరమేశ్వరులే ఇలా మారువేషాలతో వచ్చారేమో అని ఆశ్చర్యంగా చూస్తూ నిల్చున్నాడు అంశుమంతుడు. భర్త కనుసన్న గ్రహించి భానుమతి తాటాకు వీవనతో ఆ ముసలి దంపతులకు వీస్తూంది.

జడలలో ఉన్న గంగను మాటు పరచినట్టు పెడతలగా ఒదిగిన పిల్లసిగ, ఒకింత వంగిన వీపు, మిలమిలలాడుతున్న యజ్ఞోపవీతం, ఒత్తుగా పెరిగిన గడ్డం, విశాలమైన నొసటిపై విభూతి రేఖలు, రేఖల నడుమ గంగమట్టి తిలకం, నీర్కావి ధోవతి పింజమడిచి కట్టిన కట్టు, మెడలో రుద్రాక్ష తావళాలు. ఆ వృద్ధ విప్రుడికి తగినట్టుగా ఉన్నదా ముసలి ముత్తయిదువ.

మోమున దట్టంగా పూసిన పసుపు పూత, పాపటపై సిందూరం, నుదుట పెద్ద కుంకుమ బొట్టు, కనులకు తీరుగా తీర్చిన కాటుక, తాంబూలపు ఎరుపు వన్నెతో చెన్నారు చిన్నారి పెదవులు, పసుపుతాడుతో కూర్చి కంఠాన అంటి పెట్టుకున్నట్టు కట్టుకొన్న నల్లపూసలతాడు, కాళ్ళకు వెండి కడియాలు, చేతులకు నల్లని గాజులు, మోకాళ్ళ దిగదిగనట్టు బిగించి కట్టుకున్న అడ్డకట్టు నూలుకకోక... సాక్షాత్తూ సర్వమంగళ.

"ఉస్సూ, ఉస్సూ" అంటూ ఉండుండి కళ్ళు తెరుస్తూ మూస్తూ ఆ దంపతులు కొంతసేపు సేద తీర్చుకున్నారు. తరువాత అంశుమంతుడు దోసిలిపట్టి వినయంగా అన్నాడు:

"చంద్ర నిప్పులు చెరుగుతూన్న ఈ

**మనసుంటే మార్గం ఉండకపోదు. కోరిక ఉంటే అవకాశంకోసం ఎదురు చూడవలసిన అగత్యంలేదు. ఫలితంతో కాని, పరిణామాలతో కాని నిమిత్తం ఉండదు. ఇవ్వనేర్చినవాడు ఇస్తూనే ఉంటాడు, మరి.**

మండు టెండలో ఇక్కడికి ఎలా వచ్చారు, మహాత్మా? ఈ తల్లి నీతో ఈ ఎండలో ఎలా రాగలిగింది? మీది అసలేవూరు? ఈ కీకారణ్యాలలో ఎందుకిలా తిరుగుతున్నారు? ఈ వయసులో? ఈ పళ్ళు ఆరగించండి ముందు...."

భానుమతి పళ్ళ దొన్నెలు ముందు ఉంచింది. ఆ ముసలి దంపతులిద్దరూ ఉత్తరీయాలతో మొగాలు తుడుచుకున్నారు.

"మీరు ఇద్దరూ దంపతులని వేరే చెప్ప నక్కర లేదు. అనుకూలమైన దాంపత్యం. కళ్ళకి చక్కగా కనిపిస్తున్నారు. ఇక మా గొడవ అడిగావు కదూ? చెపుతున్నాను, విను" అని ఆ ముసలాయన తన ఇల్లాలి నొకసారి ఆదరంగా చూసి అంశుమంతుడితో ఇలా అన్నాడు:

"అయ్యా! నాపేరు శంభుమిశ్రుడంటారు. విద్యలన్నీ నా నాలుక చివర నాట్యమాడుతూ ఉంటాయి. బ్రహ్మకూడా నా పాండిత్యానికి సాటికాలేడు. ఇక నావూరా? ఏదో ఒక ఊరులో అంటి పెట్టుకొని ఉండడం నా స్వభావం కాదు. సామాన్యంగా కొండమీద కాలక్షేపం చేస్తూ ఉండడం నాకు పరిపాటి. నాకు ఒకే ఒక స్నేహితు డున్నాడు. ధనవంతులలో ఆయనే ముందు చెప్పాలి. ఇంతెందుకూ? సిరీశ్వరుడే అనుకో! నేను కన్నెత్తి చూస్తే చాలు, పనులన్నీ చిటికెలో చిటికెలో చేసి వచ్చే బంగం హద్దుమీరినంత వుంది నాకు. ఈ ముసలమ్మ— చూశావా? ఇల్లు దిద్దుకోవడంలో చాలా నేర్పరి. ధైర్యానికి పర్వతపుత్రిక గాని సామాన్యురాలు కాదు.

"ఇన్నీ ఉండి మా సంసార విషయం ఏమి చెప్పమన్నావు? ఎందుకూ కానివాళ్ళమై ఇలా తిరగవలసి వచ్చింది."

నుదుటి చెమట కొనగోట మీటి ఆవృద్ధుడు చెప్పసాగాడు.

"చెప్పక తప్పదు. చెప్తున్నాను విను, నాయనా! మాకు ఇద్దరు కొడుకులు కలిగారు. వాళ్ళలో ఒకడు దేవకార్యం కోసం మమ్మల్ని వదిలి వెళ్ళిపోయాడు. తిరిగి నేటిదాకా మా దగ్గరకు రానేలేదు. వాడికన్న పెద్దవాడు ఇంటిపట్టున ఉండి మమ్మల్ని కనిపెట్టుకుని ఉండడం కలలో

## యామిజాల పద్మనాభస్వామి

కూడ లేదు. ఈ కొడుకులు మాకెందుకు కలిగినట్టు? కని గొడ్డువాళ్ళమై పోయాము. ఏమి చెప్పమంటావు, మా అవస్థ? అదేమిటో చిత్రం! అన్నీ ఉండి ఏమీ లేనట్టుంది మా బ్రతుకు. ఈ లేమి ఒకటి దాపరించింది మానెత్తిమీద శని లాగ. ఇంకేముంది? ఈ బాధలతో ఇలా వృద్ధాప్యం అనుకోకుండా వచ్చి పడింది. ఇకపితృఋణం తీర్చుకోడం ఎలాగా అని కుమిలి పోతున్నాం. ఈ ముసలిదాని కడుపుమంట చెప్పనే అక్కరలేదు."

వృద్ధుడు బరువుగా ఊపిరితీసి విడిచాడు. ఆ ముసలాయన మాటలు వినగానే అంశుమంతుడు కనులు చెమ్మగిల్లాయి. "శివశివా!" అన్నాడు మెల్లగా.

"అయ్యో! ఇంతతో వంశం తెగిపోవలసిందేనా? అని దుఃఖిస్తూ ఒక్క కొడుకు కలిగితే బాగుండునని ఇద్దరము ఎంతో ఆరాటపడుతున్నాము. మా కోరిక తెలిసిన వాళ్ళంతా హేళనగా నవ్వుతారేగాని పరమార్థం గ్రహించరు. ఈ అవ్వకీ తాతకీ కొడుకు కలగాలట— అని కొందరు వికారంగా నవ్వ నారంభించారు. మేము వాళ్ళ నవ్వులు పట్టించుకోకుండా ఊరూరా తిరుగుతూ ఒక నాడు వెండికొండ పక్కకి వెళ్ళాము. అక్కడ రకరకాల చెట్లనూ, పూలతీగలనూ, వికసించిన పువ్వుల్నీ చూస్తూ ఆ తోటలో ఉన్నాము. అంతలో వసంత ఋతువు వచ్చింది. గండుకోయిల కూత నా గుండెల్లో మన్మథుడి విజయభేరి మ్రోతలా వినిపించేది. తుమ్మెదలు పూదీగలమీద ముసురుకొని ఝుంకారాలుచేస్తూ ఉంటే మన్మథుడి విల్లు, తొమ్మని గర్జిస్తూ నన్ను బెదిరిస్తున్నట్టుండేది. ఈ అవ్వ చిన్నప్పుడు ఈమెతో నేను కొంతకాలం ఆ ప్రాంతాన ఉండేవాణ్ణి. ఆ కాలం అంతా నాలో గిర్రున తిరిగింది. దానితో నా తల తిరగ నారంభించింది. ఆ వికారాలు చెప్తే నవ్వుతావు" అని ముసలమ్మను చూశాడా తాత. చిన్న నవ్వుతో అంశుమంతుడు భానుమతిని చూశాడు. మునుసిగ్గుతో భానుమతి రవంత తలవంచుకున్నది. మళ్ళీ ఆ తాత అన్నాడు:

"అలా ఉండగా దైవవశాత్తు ఒకనాడు మా దగ్గరకు ఒక సిద్ధుడు వచ్చాడు. నన్ను చూసి—

'బ్రాహ్మణోత్తమా! ఈ ముసలమ్మా నువ్వూ ఎందుకో విచారిస్తున్నట్టున్నారు. దేనికో సందేహించకుండా చెప్పు' అని అడిగాడు.

"నేను ఏమని చెప్పేది? సిగ్గూ, చిరాకూ కలిగాయి. కాని అంతలోనే తేరుకొని పేదవాడి తెగులు వీధిని పెడితేగాని తీరదన్నట్టు మా బాధ చెప్పేశాను. ఆ సిద్ధుడు విని జాలిగా చూసి ఒక ఉపాయం చెప్పాడు. మహానుభావా! ఏమని చెప్పేది! అది...."

"ఆర్యా! సందేహించకు. చెప్పు. ఆ సిద్ధుడేమి

చెప్పాడో సెలవియ్యి. నావల్లనయితే తప్పక తీరుస్తాను" అన్నాడు ఆత్రంగా అంశుమంతుడు. ఆ తాత నిట్టూర్పు విడిచి తల తడుముకుంటూ అన్నాడు:

"ఆ సిద్ధుడన్నాడు కదా— 'అయ్యా, విచారించకు. మీ యిద్దరికీ మళ్ళీ యవ్వనం వచ్చేట్టు ఒక ఔషధం ఇస్తాను. నువ్వు చెయ్యవలసేది చెప్తా విను.

'ప్రస్తుతం పుత్ర సంతతికోసం హిమవత్పర్వతం ప్రాంతాన సూర్యవంశ రత్నం అంశుమంతుడనే రాజమౌళి భార్యతో సహావచ్చి శివుణ్ణి గూర్చి తపస్సు చేస్తున్నాడు. అతన్ని ఒప్పించి ఆ రాజు రక్తం తీసుకురా! ఒక కుండెడు రక్తం తేవాలి. దానితో కాళికాదేవికి సమారాధన చేస్తాను. అంతతో దేవి ప్రసన్నురాలై ఒక దివ్యమూలిక ఇస్తుంది. ఆ మూలికను నువ్వు, ఈ ముసలమ్మ తలలమీద చెరిసగం ఉంచుకుంటే వెంటనే యవ్వనం వస్తుంది. కావలసినంత సిరీ సంపదా లభిస్తాయి. హాయిగా కాలక్షేపం చేస్తారు. మీ కోరిక తీరుతుంది!' అని. 'ఇదుగో, ఇప్పుడే వెళ్ళి ఆ రాజునే ఇక్కడికి తీసుకువస్తాము ఏదో చెప్పి. ఇక్కడే నువ్వు ఉండు' అని మేము ఇలా వచ్చాము. నువ్వు మాకేమీ చెయ్యనక్కర లేదు. ఆ రాజు ఈ ప్రాంతాన ఎక్కడ ఉంటాడో కాస్త గుర్తు చెప్పు. పోతాము." ఆ ముసలాయన తలవంచుకొని తామరాకుమీద వేలితో రేఖలు గీస్తున్నాడు.

ముసలిబాపని మాటలకు అంశుమంతుడి పెదవులపై చిరునవ్వు చిన్ని మల్లెపువ్వులాగా విరిసింది. ప్రక్కనున్న భార్య భానుమతిని చూసి—

"భానుమతీ! పెద్దల మాట విన్నావా? ఆంతర్యం అర్థమైందా?" అని సన్నగా అన్నాడు. భానుమతి నిండుకుండలాగా తొణకకుండా అన్నది:

"విన్నాను, ఆర్యపుత్రా!"

"బ్రహ్మప్రీతిగా అశాశ్వతమైన ఈ శరీరాన్ని సమర్పించవలసిన భాగ్యం అనుకోకుండా వచ్చింది. మన తపస్సు ఫలించింది. ఏమంటావు?"

"ఇంతకంటే సదవకాశం మరి రాదు."

"నిజమే. ఇంతకాలం త్రికరణశుద్ధిగా శంకరుణ్ణి గురించి తపస్సు చేస్తున్నాము. ఈ నిమిషం వరకు పరమేశ్వరుని దయ మనమీద ప్రసరించలేదు. ఈ బ్రాహ్మణుని కోర్కె మనం చెల్లించి, మనకి అన్నీ ఫలించినట్టే తృప్తిపొందుదాము."

"అలాగే చెయ్యండి. దధీచి, శిబి, బలి మొదలైన వారందరూ పరోపకారంకోసం తను త్యాగం చేసినవారే. ఈ బ్రాహ్మణుని కోర్కె నెరవేర్చడం కోసం నేనూ మీతో సిద్ధంగా ఉన్నాను" అని సంతోషంగా చెప్పింది భానుమతి.

"అయ్యా! నేనే అంశుమంతుణ్ణి" అన్నాడు అంశుమంతుడు. ఆమాట వినగానే వృద్ధ బ్రాహ్మణుడు ఆనందాశ్చర్యాలతో పొంగిపోయాడు.

"ఆహా! ఏమి నా అదృష్టం! వెదకబోయిన తీగ కాళ్ళకి తగిలినట్టయింది. నీవేనా అంశుమంతుడవు, శూరోత్తమా! ఆడబోయిన తీర్థం ఎదురయినట్టు జరిగింది నా ప్రయత్నం.

"సరేకాని, నామాట విన్నావు కదూ? ఆలోచించుకో. తొందరలేదు."

"ఆలోచించడానికేమీలేదు, మహాత్మా! అంగీకరిస్తున్నాను. రావడానికి సిద్ధంగా ఉన్నాను."

"మహారాజా! తొందరపడకు. ఎవడో కక్కుర్తి బ్రాహ్మడు వచ్చి అడిగాడని అనుకోకు. ఇది ప్రాణంతో చెలగాటం. ఎదుటివాళ్ళకి ఏమి తెలుస్తుంది కష్టమూ, సుఖమున్నూ?"

"మహాత్మా! మీరు అలా సందేహించవద్దు. నేను త్రికరణశుద్ధిగా చెప్తున్నాను. మీ వంశం నిలపడానికి నా తనువును త్యాగం చెయ్యడంలో ఏలాంటి సందేహమున్నూ లేదు."

"నీమాట బాగానే ఉందిగాని ఇద్దరమూ ఒక కోరికతోనే ఉన్నాము. నీ వంశం తెగిపోకుండా కొడుకుకోసం ఈ అడవికి వచ్చి తపస్సు చేస్తున్నావు నువ్వు. నీ గుక్కెడు ప్రాణాను నాకు ధార పొయ్యమంటున్నాను నేను. పాపం! వద్దులే. ఇంకేదైనా ఉపాయం చెప్పవయ్యా! అని ఆ సిద్ధుణ్ణే బ్రతిమాలుతాను. అదుగో, ఆ ఇల్లాలు పసుపూ, కుంకుమా తుడిచేయడానికి ఎందుకో నా మనస్సు ఒప్పుకోకుండా ఉంది."

"అయ్యో! అలా అనవద్దు, మహాత్మా! నేను నాపతితో సహగమనంచేసి, ఆయనతోపాటు ఉత్తమ లోకానికి పోతాను. నన్ను చూసి విచారించవద్దు" అని ఆత్రంగా అన్నది భానుమతి.

"మహాత్మా! పరమపావనమైన సూర్యవంశానికి కళంకం తెస్తానా? నా తనువూ, ప్రాణమూ నీ అధీనం చేస్తున్నాను. పద, వస్తున్నాను. అతిథి కోరికను తీర్చడంలో సూర్యవంశపు రాజులు ఎన్నడూ వెనుకడుగు వెయ్యరు" అని గంభీరంగా అన్నాడు అంశుమంతుడు, దిగ్గున లేచాడు.

• • •

కిలకిలమని నవ్వు వినిపించింది. ఎట్టఎదుట ఉన్న వృద్ధ దంపతులు నాలుగడుగులువేసి కనిపించకుండా అయిపోయారు. అంశుమంతుడు ఆశ్చర్యపడి ఇటూ అటూ చూస్తున్నాడు. భానుమతి బితుకుబితుకుమని చూస్తూ ఉంది.

"దేవీ! ఏరీ ఈ వృద్ధ దంపతులు?"

"అదే చూస్తున్నాను, ప్రభూ! వింతగా ఉందే!"

"వింతగా ఉందా? ఏమిటి?" అంటూ అక్కడికక్కడే గౌరీ శంకరులు ప్రత్యక్షమయ్యారు.

అంశుమంతుడి ఆనందానికి అంతులేదు. దంపతు లిద్దరూ గౌరీ శంకరులకు సాష్టాంగ వందనంచేసి నిల్చున్నారు. "శుభమస్తు" అని శంకరుడుదీవించాడు.


"మహాదేవా! ఇన్నాళ్ళకు ఈ దీనునిపై దయ వచ్చిందా?" అని దీనంగా అన్నాడు అంశుమంతుడు.

"రాజా! విచారించకు. కర్మ పరిపక్వంకావాలి. అయింది. వచ్చాము."

"మహా ప్రసాదం! కాని ఇక్కడకు ఒక వృద్ధ బ్రాహ్మణుడు భార్యతో వచ్చి కోరగా ఈ శరీరం ఇస్తానని మాట ఇచ్చాను. ఆయన మరి కనిపించలేదు. ఆ ముసలమ్మకూడా అంతే... ఏమయారో ఆ దంపతులు!"

అంశుమంతుడి మాటలు విని శంకరుడు నవ్వి, "రాజా! నీమనోనిష్ఠ తెలుసుకోవాలని నేనే అలా వచ్చాను. ఆ ముసలమ్మే నా ప్రక్కనున్న ఈ ముసలమ్మ" అని గౌరిని చూపి, "గౌరీ! అంశుమంతుని స్వభావం తెలుసుకున్నావా?" అన్నాడు శంకరుడు.

"దేవా! తెలుసుకున్నాను. మీ భక్తులెంతకైనా తగిన వారే. మీరు కోరగా తమ తనువులు త్యాగం చేస్తామన్న ఈ రాజదంపతులకు తుష్టిగా కోరిన వరాలిచ్చి వేయవలసిందే అని నామనవి" అన్నది గౌరమ్మ.



చిన్నారి చిలక

చిత్రం—ఎస్. వి. రామంచయ్య (బెంగుళూరు-13)

"వరం కోరుకో, రాజా!" అన్నాడు శివుడు.

"దేవా! కులదీపకుడైన కుమారుణ్ణి ప్రసాదించవలసిందని ఈ దాసుని మనవి" అని అంశుమంతుడు దోసిలిపట్టాడు.

"అలాగే ఇస్తున్నాము. నా అంత బలవంతుడైన కొడుకు నీకు కలుగుతాడు. పాశుపతాస్త్రం ఉపదేశిస్తున్నాను నీకు. పట్టాభిషేకం చేశాక దాన్ని నీ కొడుకుకు ఉపదేశించు" అని శివుడు సమంత్రకంగా పాశుపతాస్త్రాన్ని అంశుమంతుడికి అనుగ్రహించాడు.

గౌరి తన పెండ్లినాడు తండ్రి హిమవంతుడిచ్చిన ముత్యాల హారాన్ని కంఠంనుంచి తీసి కళ్యాణసిద్ధిగా దీవించి భానుమతి కంఠాన వేసింది.

కోరిక తీరక శిశిర ఋతువులాగ నిస్సారమైపోయిన అంశుమంతుని సంసారయాత్ర శివానుగ్రహం వల్ల కొత్త వెలుగులు సంతరించుకొని వసంతవైభవంతో కలకలలాడింది. ఉద్యానవనంలో ప్రకృతిలక్ష్మి కొత్త సొబగుతో కొమ్మకొమ్మనా చిగురుపెట్ట సాగింది. అంతఃపురంలో అంశుమంతుని గృహలక్ష్మి భానుమతి కపిలగోవులాగా నిండుగా నడయాడ సాగింది.

తూరుపు కొండ చిటారు కొమ్మమీదనుంచి సూర్యుడు ప్రకృతిని తొంగి చూస్తున్నాడు. అంతఃపురంలో దాదులు మహా సందడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. వెలుపల అల్లంత దూరాన కనకాసనంమీద కూర్చున్నాడు అంశుమంతుడు. "ఏమి, ఎలా ఉంది?" అని వచ్చిపోయే దాసిని అడుగుతున్నాడు. "చెప్తాము మహారాజా!" అంటూ దాసి తొందరగా పోతూంది. "పనసపండు లాంటి మగపిల్లవాడు" అన్నది మంత్రసాని వచ్చి. అంశుమంతుడు ఆనందాతిరేకంతో మిన్నందుకున్నాడు. కంఠంలో ఉన్న ముత్యాల హారందాని మీద విసిరి "కట్నం తీసుకో" అన్నాడు. అరనిముసంలో అయోధ్య అంతా పుత్రోత్సవంతో పొంగిపోయింది. కులగురువు వసిష్ఠుల వారు వచ్చి అంశుమంతుణ్ణి చూసి ఆనందంగా దీవించారు—

"వంశాభివృద్ధిరస్తు!" అని.

"ఈ బాలుడిపేరు దిలీపుడు" అని అశరీరవాణి పలికింది. దేవతలు పారిజాత ప్రసూనాలను జడివానగా కురిశారు.

ఆ సమయంలో దేవకాంతలను వెంటబెట్టుకొని శచీపురందరులు వచ్చారు. పురందరుడు అంశుమంతుణ్ణి కౌగలించుకొని, "నీకొడుకు కులదీపకుడవుతాడు" అన్నాడు.

"మహా ప్రసాదం" అన్నాడు శిరస్సు వంచి అంశుమంతుడు.

శచి పురుటింటికి వెళ్ళి మణులుతాపిన పులిగోరు పతకం, పసిడి మురుగులు, రత్నాంగుళీయం, అందెలు పిల్లవానికి యిచ్చి భానుమతిని చూసి, "అదృష్టవంతురాలవు, భానుమతీ! ఈబాలుడు మూలపురుషుణ్ణి పోలి అన్ని లోకాలకూ తన ప్రతాపం వ్యాపింపజేస్తాడు. నూరు అశ్వమేధయాగాలు చేసి మా వారికి సాటి అవుతాడు" అన్నది.

పచ్చి బాలెంతరాలు భానుమతి మెల్లగా చేతులెత్తి జోడించి శచీదేవికి నమస్కరించింది.

"ముల్లోకాల రాణివి. ఇది మాకు వరం. మా గొప్పదనం కాదమ్మా ఇది. ఈశ్వరానుగ్రహం. మీ దయ. ఈ పసివాణ్ణి నీ జయంతుడులాగ చూసుకుంటూ ఉండు తల్లీ!" అని పురుటి కందును శచీదేవి చేతుల్లో పెట్టింది. శచీదేవి దిలీపుణ్ణి ఎత్తుకుని పాలచెక్కిళ్ళు ముద్దాడి భానుమతికి అందించి, "పోయి వస్తాము. పథ్యపానాలు జాగ్రత్త, భామా!" అని చిరునవ్వుతో పురుటాలి చెక్కిలిపై చిటిక వేసింది. ఆమాటకు ఆ బాలెంతరాలి చెక్కిళ్ళు చిరునవ్వుతో మరింత ధగధగలాడాయి. ★


# రాజా స్నో

మీకు, మీ కుటుంబానికంతకు, ఏ ఋతువులో, ఏ వాతావరణములోనైనా ఆదర్శమైన సౌందర్య సాధనం - రాజా స్నో.

మన్యం & కంపెనీ బెంగుళూరు




# ఉచితం!

## అందమైన, ఎవర్ సిల్వర్ టీ స్పూను



ఓవోమాల్ట్

ఫుడ్స్ ఫ్యాట్స్ & ఫెర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్,

